

మాటల తూటాలు

- కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ
- కాక రేపుతున్న పొన్నం దీక్ష
- గాంధీభవన్, తెలంగాణ భవన్ వద్ద చేయాలంటున్న బండి సంజయ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
మరో ఆరు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయి నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండగా జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంటున్నది. రెండు రోజులుగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మాటల తూటాలు పేలుతున్నాయి. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తిచేసుకున్నా విభజన హామీలను విస్మరించిందని, దానికి నిరసనగా ఈనెల 14న కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో దీక్ష చేపడతానని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా ఆయనకు దీటుగా సమాధానం చెప్పేందుకు సిద్ధం కావడం రాజకీయ కలకలాన్ని సృష్టిస్తున్నది.

● రోజురోజుకు మారుతున్న సమీకరణాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని చేసిన ప్రచారం చేసింది. ఇప్పుడు బీజేపీ అదే అస్త్రాన్ని సంధిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అంటూ ప్రచారం చేయడం కరీంనగర్‌లో కొత్త సమీకరణాలకు తెరతీసే అవకాశం కనిపిస్తున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే ప్రచారంలో ఎంతో ముందంజలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను నిలువరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ అధిష్ఠానం ఇంకా కరీంనగర్ అభ్యర్థి ఎవరో ఖరారు చేయక పోవడం మైనస్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోతున్నదని, అసలు అభ్యర్థే లేడని ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పలేని పరిస్థితిలో ఆ పార్టీ ఉందని బీజేపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నది.

● పరస్పర ఆరోపణలు

విభజన హామీలను విస్మరించిన బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని, ఓట్లు అడిగే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని పొన్నం ప్రభాకర్ విమర్శిస్తున్నారు. గడిచిన పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకున్నారని ఆయన విమర్శించారు. రాముడి ఫొటోలు, అక్షింతలు ఇంటింటికి పంపడం మినహా ప్రతి ఇంటికి ఏమి చేశారో చెప్పాలని, బీజేపీకి చేతనైతే రాముడి బొమ్మతో కాకుండా మోదీ బొమ్మతో ఓట్లు అడగాలని పొన్నం సవాల్ విసిరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తమతమ నియోజకవర్గాల్లో ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

- పొన్నం ప్రభాకర్ దీక్షా ప్రకటనను ఎంపీ బండి సంజయ్‌కుమార్ తీవ్రంగా దుయ్యబట్టారు. పదేళ్లుగా ఈ విషయంలో పొన్నం ప్రభాకర్ ఏం చేశాడని, ఇప్పుడు దీక్ష ఎందుకు చేస్తానంటున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, వాటికి నిరసనగా ధమ్ముంటే తెలంగాణ భవన్ వద్ద దీక్ష చేయాలని పొన్నంకు సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా గాంధీ భవన్ ఎదుట ధర్నా చేయాలని ప్రభాకర్‌ను డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాలు దగాకు గురైతే ఒక్కనాడు కూడా ఎందుకు దీక్ష చేయలేదని, మద్దతు ధర రాక వడ్ల కుప్పలపై బడి రైతులు గుండె పగిలి చస్తుంటే ఎందుకు దీక్షలు చేయలేదని పొన్నం ప్రభాకర్‌ను ప్రశ్నించారు. నరేంద్ర మోదీ 80 కోట్ల మంది పేదలకు ఏళ్ల తరబడి ఉచితంగా బియ్యం ఇస్తున్నందుకు దీక్ష చేస్తావా..., దేశ ప్రజలందరికీ కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చినందుకు దీక్ష చేస్తావా ప్రజలకు వివరించాలని సంజయ్ పొన్నంను ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి 12 వేల కోట్ల నిధులు ఇస్తున్నందుకు దీక్ష చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అభ్యర్థే దొరకని కాంగ్రెస్, బీఆర్ఎస్ అపరమేధావి కలిసి తనను ఓడించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌ను తానే అభివృద్ధి చేశానంటున్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ఎందుకు పారిపోయారో ఆయన కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎందుకు డిపాజిట్ రాకుండా చేశారో జవాబివ్వాలని ఆయన సవాల్ విసిరారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజల్లోకి వెళుతూ విమర్శనాస్త్రాలు సంధిస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీ గెలుపును అడ్డుకోవాలని చూస్తున్నాయని ఆ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీని గెలిపించాలని బండి సంజయ్‌కుమార్ ప్రజలకు వివరిస్తున్నారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేయాలి
- నేర సమీక్షా సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 12: కమిషనర్ కంప్లైంట్ సెల్ (సీసీసీ)కు వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యే దృష్టి సారించాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ కేంద్రంలో నేర సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సీసీసీ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి వాటిపై తగినవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. చెక్‌పోస్ట్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాహన తనిఖీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండోవర్ చేసిన వారి గడువు ముగిసిన వారిని మళ్లీ బైండోవర్ చేయాలని సీపీ ఆదేశించారు. ఎన్నికల నియామవళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలపై ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న సమయంలో అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలన్నింటిని సంబంధిత స్టేషన్ల అధికారులు పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సీపీ తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, జాప్యానికి కారణాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. త్వరగా కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. భౌతిక నేరాలకు సంబంధించిన వారెంట్లను అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎటువంటి ఉల్లంఘనలు ఉన్నా సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్‌జి, మాధవి, విజయ్‌కుమార్, వేణుగోపాల్, కాశయ్య పాల్గొన్నారు.

భద్రాద్రి రాముడి తలంబ్రాల పోస్టర్ ఆవిష్కరణ



భద్రాద్రి తలంబ్రాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఏప్రిల్ 12: ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా పంపిణీ చేయనున్న భద్రాద్రి రాముడి కల్యాణ తలంబ్రాల పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 17న భద్రాచలంలో జరగనున్న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ తలంబ్రాలను కలెక్టర్ బుక్ చేసుకున్నారు. ఈ మేరకు రసీదును ఆర్టీసీ అధికారులు కలెక్టర్‌కు అందించారు. కల్యాణ తలంబ్రాలు కావలసిన భక్తులు 151 రూపాయలు చెల్లించి 18లోగా కరీంనగర్ లాజిస్టిక్స్ బస్‌స్టేషన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా, ఆర్టీసీ వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లాజిస్టిక్స్ మేనేజర్ ఎస్ సదాశివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు అవినాశ్, జగన్ పాల్గొన్నారు.

కోడ్ కూసింది.. జాగ్రత్త

- నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు
- పోలీసుల తనిఖీలు ముమ్మరం...



కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 12: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగనుంది. ఈ సందర్భంగా ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు శుక్రవారం సీపీ అభిషేక్ మొహంతి ఎన్నికల సమావేశం నిర్వహించి కమిషనరేట్‌లోని పోలీస్ అధకారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం చెక్ పోస్ట్‌లలో, ఇతర ప్రాంతాల్లో పోలీసులు, స్పెషల్‌స్క్వాడ్‌ల తనిఖీల సమయంలో ఒక వ్యక్తి వద్ద 50 వేలకు మించి నగదు లభిస్తే ఆ డబ్బులకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే ఆ డబ్బులను సీజ్ చేస్తారు. నగదు, బంగారం ఇతర వస్తువు(ఓటర్లను ప్రలోభపరిచే మహుమతులు)ల తరలింపుపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. పోలీసులు, అధికారుల తనిఖీల్లో సాధారణ ప్రజలు నగదు, బంగారం, వెండికి సంబంధించి సరైన పత్రాలు చూపించకుంటే వాటిని సీజ్ చేస్తారు. ఎలాంటి ఆక్షేపణలు లేనట్లయితే వారం రోజుల్లో ఆధారాలు చూపిస్తే తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది.సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు అధికారులతో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. డబ్బులు, ఇతర వస్తువులను ఈ కమిటీ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటుంది.

● ఐదు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు

కమిషనరేట్ పరిధిలో ఐదు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలోని రాజీవ్ రహదారిపై మొగ్ధుంపూర్ గ్రామ శివారులో, తిమ్మాపూర్ మండలం రేణికుంట, చొప్పదండి మండలం ఆర్నకొండ, హుజురాబాద్ నియోకవర్గంలోని పర్కాల ఎక్స్‌రోడ్, ఇల్లందకుంట మండలం సిరిసెడ్ గ్రామ ఎల్లమ్మ దేవాలయం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్ట్‌ల వద్ద పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు 24 గంటలపాటు విధుల్లో ఉంటూ అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో మూడు సర్వలైన్‌టీంలు, మండాలనికి ఒక వీడియో సర్వలైన్‌టీంను ఏర్పాటు చేశారు.

● సభ, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎక్కడైనా సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తున్నాం, ఎక్కడ నిర్వహిస్తున్నాం వంటి వివరాలన్నీ ముందుగా తెలియజేస్తే పోలీస్ వ్యవస్థ అందుకు ఏర్పాట్లు చేస్తుంది. సమావేశంలో లౌడ్ స్పీకర్లు వాడాలనుకుంటే అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తే దానికి సంబంధించిన సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుంది. ర్యాలీ ఎక్కడ మొదలవుతుంది, ఏ మార్గంలో వెళ్తుంది, ఎన్నింటికి మొదలవుతుంది, ఎన్నింటికి, ఎక్కడ ముగుస్తుందన్న విషయాలు స్పష్టంగా తెలియజేయాలి. ర్యాలీ నిర్వహించే సమయంలో మార్గం మార్చడం వంటివి చేయరాదు.ర్యాలీ సాగే మార్గంలో అప్పటికే ఏవైనా నిషేధాజ్ఞలు ఉంటే నిర్వాహకులు దాన్ని పాటించాల్సి ఉంటుంది. ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, తగలబెట్టడం నిషేధం.

● నగదుకు ఆధారాలు తప్పనిసరి

శుభకార్యాలు, ఆసుపత్రుల బిల్లు, విద్యాసంస్థల్లో ఫీజు చెల్లించటం, వ్యాపారులు, ఇతరత్రా అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకెళ్తున్న వారు తగిన ఆధారాలు వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఆసు పత్రులకు డబ్బులతో వెళుతున్నవారు పేషెంట్ రిపోర్టులు, ఆసుపత్రి రశీదులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి. అవసరాల కోసం బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసిన సమయంలో సంబంధిత ఖాతా బుక్, ఏటీఎం రశీదులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి. ధాన్యం, భూములు, ఇళ్ల విక్రయాలకు సంబంధించిన డబ్బు అయితే సంబంధిత బిల్లులు, ల్యాండ్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. బంగారం, వెండి ఆభరణాల కొనుగోలు సమయంలో రశీదులు వెంట ఉంచుకోవాలి. వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే తనిఖీల సమయంలో లావాదేవీల వివరాలను ఆధారాలతో అధికారులకు చూపించాలి. వ్యక్తుల శరీరంపై ఉన్న ఆభరణాలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. 10 లక్షలపైగా నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు కూడా రంగంలోకి దిగుతారు. వాటికి సంబంధించి కచ్చితమైన ఆధారాలు చూపిస్తేనే తిరిగి ఆ డబ్బులు ఇస్తారు. తనిఖీలలో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులన్నింటిని జిల్లా ట్రెజరీలో భద్రపరుస్తారు. స్క్రీనింగ్ కమిటీ, ఆదాయపన్నుశాఖ అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇస్తేనే ఆ డబ్బులు, వస్తువులు యజమానులకు అప్పగిస్తారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధిక మొత్తంలో నగదు చలామణి విషయంలో ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సర్వలైన్‌టీం సిబ్బంది అనుక్షణం తనిఖీలు చేస్తుంటారు.

గ్రానైట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12: జిల్లా గ్రానైట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. జిల్లా అసోసియేషన్ భవన్‌లో పి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రగతి నివేదికను వెల్లడించారు. దశాబ్ధ కాలంగా గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను ప్రభుత్వాల సహకారంతో పరిష్కరించామన్నారు. 82 గ్రానైట్ ఫ్యాక్టరీలతో అద్దె భవనంలో అసోసియేషన్ కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. 2019 వరకు 425 ఫ్యాక్టరీలు పెరగగా నిధులు సమీకరించి 120 ఎకరాల్లో అధునాతన భవనాన్ని నిర్మించామన్నారు. వ్యర్థాల కోసం 80 ఎకరాల స్థలాన్ని సేకరించామన్నారు. అసోసియేషన్ ఫండ్ వివరాలను పారదర్శకంగా సభ్యులందరికి అందజేశామని, మూడు నెలల్లో బైలాస్ ప్రకారం జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై చర్యలకు చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. సమవేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగుల ప్రదీప్, కోశాధికారి జిల్లా అశోక్, ఉపాధ్యక్షుడు చిట్టుమల్ల కిరణ్, సంయుక్త కార్యదర్శులు కడారి శ్రీనివాస్, వేణుగోపాల్, కాల్వ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

నేడు నగరంలో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఏప్రిల్ 12: నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఈ కొల్పుల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రేకుర్తి, కొత్తపల్లి, శాతవాహన యూనివర్సిటీ, నగునూరు, బొమ్మకల్, ముగ్ధుంపూర్, చర్లబూత్కూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని కోరారు. అంబేద్కర్‌నగర్, వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, ఎస్ఆర్ఆర్ కళాశాల, సప్తగిరి కాలనీ, భగత్‌నగర్, ఉజ్వలపార్కు, వాటర్ వర్క్స్ (హౌజింగ్ బోర్డు కాలనీ) ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీఈ నరేందర్ తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నాలుగేళ్లు ఆగమవుడే

- బీజేపీ పదేళ్ల పాలనలో చేసిందేమి లేదు..
- అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నాలుగేళ్లు ఆగమవ్వాల్సి వస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ రాంనగర్‌లో అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కరీంనగర్ రోడ్లు, డ్రైనేజీలతో అద్భుతంగా అభివృద్ధి చెందిందని, నాటి సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ కృషి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్ తోడ్పాటు వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు. కేసీఆర్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్-మనోహరాబాద్ రైల్వేలైనును మంజూరు చేయించారని, 2014లో ఎంపీగా గెలిచిన వినోద్‌కుమార్ నిధులు తేవడంతో పనులు వేగంగా జరిగాయన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించిన ఘనత వినోద్‌కుమార్‌దేనని తెలిపారు. ఎంపీగా వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో 106 సార్లు మాట్లాడి జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరీ చేయించారని, ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక్కసారైనా నియోజకవర్గానికి ఇది కావాలని పార్లమెంట్‌లో మాట్లాడారా అని ప్రశ్నించారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమి లేదని, అన్ని వస్తువుల ధరలు పెంచిందని



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

విమర్శించారు. బీజేపీ పేద ప్రజల కోసం ఒక్క పథకమైనా అమలు చేయలేదని, తాము చేసిన పనులు చెప్పుకోలేకనే ఆ పార్టీ నాయకులు చిత్రపటాలను, క్యాలెండర్లను ఇంటింటికి పంపిణీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చిత్రపటాలు కడుపు నింపుతాయా, ఆకలి తీర్చుతాయా ఆలోచించాలని కోరారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌ను ఉన్నతస్థాయిలో నిలుపుతారని అన్నారు. కేసీఆర్ హయాంలో కరీంనగర్‌లో నగరపాలక సంస్థ రోజు తాగునీటిని సరఫరా చేస్తే కాంగ్రెస్ నాలుగునెలల పాలనలో రెండురోజులకోసారి నీళ్ళు ఇస్తున్నారన్నారు. రేవంత్‌సర్కార్ అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ కరీంనగర్‌కు వచ్చి సాగు, తాగునీరు అందించాలని, 500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలువాలని డిమాండ్ చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు సీఎం మాట్లాడాల్సిందేనా ఒక్కసారి ఆలోచించాలని కోరారు.తెలంగాణ ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం, ఆరు గ్యారెంటీల అమలు కోసం బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని హరీష్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎంపీగా వినోద్‌కుమార్ కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తెచ్చిఅభివృద్ధికి బాటలు వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీగా 2014లో గెలిచి కరీంనగర్‌ను అభివృద్ధి చేశానని, 2019లో ఓడిపోయినా ఇక్కడే ఉండి కరీంనగర్ ప్రజల కోసం పనిచే శానని, తనను మళ్లీ ఎంపీగా గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో హుజురా బాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ పాల్గొన్నారు.





పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్ట్‌మార్టం

మానకొండూర్, ఏప్రిల్ 12: మండలంలోని లింగాపూర్ గ్రామంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించి పోలీసులు పోస్ట్‌మార్టం చేయించారు. వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్ గ్రామానికి చెందిన బట్టూరి సంపత్‌కుమార్ (34) పిల్లలు పుట్టడం లేదని ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని పోలీసులకు తెలుపకుండా 11న మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఈ సమాచారం పోలీసులకు అందింది. దీంతో శుక్రవారం పోలీసులు గ్రామానికి చేరుకుని సంపత్‌కుమార్ కుటుంబసభ్యులను విచారించారు. సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించుకుని పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించారు. అక్కడికే వైద్య సిబ్బందిని తీసుకొచ్చి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మళ్లీ మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. సంపత్‌కమార్ తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 12: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన పూదరి రామయ్య(56) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రామయ్య తన నూతన ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు అప్పు చేశాడు. దీనికి తోడు అనారోగ్యకారణాలతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా అప్పు ఎలా తీర్చాలని మన స్తాపం చెందుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న బంధువులు రామయ్యను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ . పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. రామయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలి పారు.

నకిలీ ఉద్యోగ నియామక పత్రం

అవాక్కయిన వైద్యుడు..పోలీసులకు ఫిర్యాదు

కోరుట్ల, ఏప్రిల్ 12: నకిలీ ఉద్యోగ నియామక పత్రం చూసి ఓ వైద్యుడు అవాక్కయ్యాడు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఉద్యోగ నియామక పత్రం ఎక్కడి నుంచి వచ్చిందని డ్యూటీలో ఉన్న వైద్యుడు తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. అది నకిలీదిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగ నియామక ప్రతం జిల్లా వైద్యాధికారి పేరుతో కూడిన జాయినింగ్ లేఖను పట్టణానికి చెందిన ఓ మహి ళ శుక్రవారం ఉదయం డ్యూటీలో ఉన్న వైద్యుడు అనిల్‌కు అందించింది. వైద్యుడికి అనుమానం వచ్చి జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులకు విషయం తెలిపాడు. దీం తో వారు ఎవరికీ ఎలాంటి ఉద్యోగ నియామక పత్రం అందించలేదని అది నకిలీదని తెలపడంతో వైద్యుడు అనిల్ స్థానిక పోలీ˘ సులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చేరుకుని సంబంధిత మహిళ వద్ద ఉన్న సర్టిపికెట్లను స్వాధీనం చేసు కుని మహిళను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న కథలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యా యుడు డబ్బులు తీసుకుని నకిలీ ఉద్యోగ నియామక పత్రం ఇచ్చినట్లుగా మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆ కోణం లో విచారణ చేపట్టాడు. సదరు వ్యక్తి ఇంకా ఎంతమందికి ఇలాంటి నకిలీ నియమక పత్రాలను ఇచ్చాడో వివరాలు రాబడుతున్నారు.

ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండలంలోని ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగం పై కేసు నమోదు చేశారు. కాలనీలో గల జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు జీతాలు దుర్వినియోగంపై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 6న పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.తిరుమలతో పాటు ఆమె భర్త కె.రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు బిల్లులు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని, అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


కోరుట్ల, ఏప్రిల్ 12 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన మోటం సాయిల్ (58) అనే వృద్ధుడు మద్యానికి బానిసై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సాయిల్ ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులతో తరుచుగా గొడవ పడేవాడు. దీంతో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో మద్యం మత్తులో సాయిల్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయిల్ కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.











రైతులకు బోనస్ ఇవ్వకుంటే ఊరుకోం

- ఢిల్లీకి పంపడానికి మాత్రం పైసలు ఉంటాయా
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12 : 'ఢిల్లీకి పంపడానికి కాంగ్రెస్‌కు పైసలుంటాయ్.. అభ్యర్థులకు డబ్బులు పంపడానికి పైసలుంటాయ్ కానీ రైతులకు బోనస్ ఇవ్వడానికి మాత్రం పైసల్ ఉండవు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ' కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం తీసుకొచ్చి పది రోజులవుతోందని, ఇప్పటికీ కొనడం లేదని, తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల చొప్పున కోత విధిస్తున్నారని రైతులు బండి సంజయ్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం ఇవ్వడం లేదని, పంట చేతికి వచ్చాక కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల మేరకు కోత విధిస్తున్నారని, రైతులను దోచుకుంటున్నా పట్టించుకునే వారు లేరని అన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపుతున్నట్లు, తాలు, తేమ, తరుగు విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ల ముందు దోపిడీ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను డిపాల్టర్‌లుగా మార్చి రూ.3 లక్షల వడ్డీలేని రుణం ఎలా అందిస్తారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పెనం మీద ఉన్న రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పొయ్యిలో పడినట్లయ్యిందన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా ఉందని, పార్టీలు, ప్రభుత్వాలు మారినా వారి బతుకుల్లో మార్పు రావడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని, ప్రజలను మోసానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 12 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క ధాన్యపుగింజ కూడా కొనలేదని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్లలో 259 కేంద్రాలు ప్రారంభించారని, కొనుగోళ్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 10 రోజులుగా ఎదురుచూస్తున్నారని, కొనే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం అకాల వర్షాలకు దెబ్బతింటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నార న్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, తరుగు, తాలు, తేమ పేరుతో క్వింటాల్‌కు 7 కిలోల కోత విధిస్తే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కొంత ధాన్యం మిల్లుల వద్దకు వెళ్లాక మిగిలిన ధాన్యంలో త రుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. జనగామ లో క్వింటాల్ ధాన్యంకు రూ.1500 నుంచి రూ. 1700కు కొనుగోలు చేస్తూ ఒక్కో క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.800 వరకు నష్టం కలిగిస్తున్నారని అన్నారు. కనీస మద్దతు ధరకు గండికొడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పి, వేలాది ఎకరాలు అకాల వర్షాలకు నష్టపోతే నయాపైసా సహాయం చేయలేదని అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకపోగా కొత్తగా రైతులకు రుణాలు ఇస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ఉన్న రుణమే మాఫీ కాకపోతే కొత్త రుణం ఎలా ఇస్తారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని, రూ. 2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేయా లని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే ఇక్కడున్న మంత్రి తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నా రన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. తాను అధికారంలోనే లేనని, అవినీతి కి ఎలా పాల్పడుతానని అన్నారు. అధికారంలో ఉంది మీరేనని, దమ్ముం టే విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా పర్వలేదని, ఇకపై పనికిమాలిన గాలిమాటలు మానుకోవాలని రైతులపై దృష్టిసారించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు తదితరులు ఉన్నారు


సంకెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బండి సంజయ్

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 12: మండలంలోని మల్యాల, వాగొడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన రమేష్ 9,700 రూపాయల విలువ గల లిక్కర్‌ను జమ్మికుంట నుంచి అక్రమంగా తరలి స్తుండగా పట్టుకున్నారు. నడిగూడ మండలానికి చెందిన మనోజ్‌కుమార్ 5,500 రూపాయల విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా వాగొడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో పట్టుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బావిలో పడి డిగ్రీ విద్యార్థి మృతి


కౌశిక్(ఫైల్)

వేములవాడ రూరల్, ఏప్రిల్ 12 : సిద్దిపేట వద్ద బావిలో పడి ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందగా వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన రాచర్ల మల్లేశం-లక్ష్మీ దంపతుల కుమారుడు కౌశిక్ (23) గురువారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. సిద్దిపేట జిల్లా ఇమాంబాద్ వద్ద ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందాడు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని రైతు మృతి


గంగాధర్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్, 12: మండలంలోని రాఘవపేట గ్రామంలో సిలిండర్ బుడ్డీలను సరఫరా చేసే ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో రైతు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన మాధం గంగాధర్(32) అను రైతు గ్రామంలో పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మెట్‌పల్లికి చెందిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ బుడ్డిలను సరఫరా చేసే ఆటో ఢీకొట్టడంతో గంగాధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయాలపాలైన గంగా ధర్‌ను చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి స్థానికుల సహాయంతో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృ తుడు మాధం గంగాధర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగాధర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

వీణవంక, ఏప్రిల్ 12: వీణవంక మండలం కనపర్తి గ్రామ శివారులోని పేకాట శిబిరంపై పోలీస్‌లు శుక్రవారం దాడులు చేశారు. మేకల నారాయణరెడ్డి వ్యవసాయ భూమిలో కొంత మంది పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందుకున్న ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న రూ.49 వేల 760నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులుదీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవ స్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆ చరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూ లైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకు న్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం, బాలాత్రిపురా సుందరి దేవి ఆలయంలో కుంకు మ పూజ వంటి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించు కున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో కిక్కిరి సిపోయింది. వందలాదిమంది భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకున్న భక్తులు

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య


ప్రమీల(ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన సుల్తానాబాద్ మండలం చిన్నకలువల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రమీల(45)కు రెండు నెలల క్రితం కాన్సర్ సోకగా కరీంనగర్‌లో చికిత్స పొందుతోంది. అయితే కాన్సర్ సోకిన తాను ఏనాటికైనా చనిపోక తప్పదని, కుటుంబ సభ్యులకు భారం కాకూడదని భావించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త మొగిలి, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెక్‌డ్యాంకు మరమ్మతులు కరువు

కోనరావుపేట, ఏప్రిల్ 12: కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతంలో జలవనురుల కోసం ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం, జాలావాగు కుంట కట్ట రెండేళ్ల క్రితం వర్షాలకు కొట్టుకుపోయాయి. మరమ్మతు చేపట్టకపోవడంతో జలవనరులు వృథాగా పోతున్నాయి. భూగర్భ జలాల పెంపు, సాగునీటి సౌకర్యార్థంతోపాటు వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు నిర్మాణాలను చేపట్టారు. అటవీ ప్రాంతంలోని గరక ఒర్రెలో చేపట్టిన చెక్ డ్యాం, జాలవాగు నీరు ఆపడానికి ఏర్పాటు చేసిన కుంట కట్ట రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి మరమ్మతు చేపట్టకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా వన్యప్రాణుల దాహార్తి తీర్చు కోవడానికి ఇబ్బందిగా మారింది. వేసవిలో అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో వన్యప్రాణులు జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. నీటి వనరులను కాపాడడానికి నిధులు మంజూరు చేసి అటవీ ప్రాంతంలో కొట్టుకుపోయిన చెక్ డ్యామ్‌కు, కొట్టుకపోయిన జాల వాగు కుంట కట్టకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కొట్టుకు పోయిన మరిమడ్ల జాలవాగు కుంటకట్ట


కొట్టుకపోయిన చెక్ డ్యాం

మళ్లీ తెరపైకి 'నిజాం షుగర్స్'

- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మారిన ఎన్‌డీఎస్ఎల్
- గెలుపోటములపై ప్రభావం చూపే స్థాయిలో చెరుకు రైతులు
- కలగా మిగులుతున్న చక్కర కర్మాగారం పునరుద్ధరణ

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ని జాం షుగర్స్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతినిత్యం ఒక రిపై ఒకరు ఆరోపణలు... ప్రత్యారోపణలు చేసుకునే ప్రధాన రాజకీయ పక్షాల్లో సైతం నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) వ్యవహారంలో ఒక్కటిగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్, పసుపు బోర్డు వ్యవహారం రాజకీయ పార్టీలకు ప్రధాన అస్త్రంగా మారిన విధంగానే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఎన్‌డీఎస్ఎల్ చర్చల్లోకి వస్తోంది. బిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ పక్షాలు ఎన్‌డీఎస్ఎల్ అంశంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో చెరుకు రైతులను ఆకర్శించడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. ఆ యా పార్టీలకు చెందిన హేమా హేమీల నోట ఇటీవల ఎన్‌డీఎస్ఎల్ మాటలు వచ్చాయి. పసుపు బోర్డు ఏర్పాటు వ్యవహారం, నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ లో నెలకొన్న సంక్షోభం ప్రస్తుత ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రదానంగా ప్రభావం చూపనుంది. దీంతో చెరుకు రైతుల చుట్టూ రాజకీయం చోటుచేసు కుంటోంది. చెరుకు రైతులను ప్రసన్నం చేసుకోవడానికి అటు ప్రతి పక్ష పార్టీలు, ఇటు అధికార పక్ష పార్టీ వ్యూహ రచనలు చేస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఎస్ఎల్ అంశాన్ని ప్రచార అస్త్రం గా రాజకీయ పక్షాలు వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

1937లో నిర్మాణం..

నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని శక్కర్‌నగర్‌లో 1937లో అప్పటి నిజాం నవాబ్ నిజాం షుగర్స్ కర్మాగారాన్ని నిర్మించారు. 1979-80లో కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, మెదక్ జిల్లా ముంబోజుపల్లి, జహీరాబాద్‌లలో నిజాం షుగర్స్ కర్మాగారాలను నిర్మించారు. 2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కర్మాగారాలను నష్టాల కారణంగా ఉమ్మడి యాజమాన్యం కిందకు తెచ్చింది. 2002 అక్టోబర్ 31వ తేదిన ఆంధ్రాప్రాంతానికి చెందిన డేల్టా కంపెనీకి ఉమ్మడి యాజమాన్యం కింద అప్పగించింది. అప్పటి నుంచి నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. 2015 డిసెంబర్ 22 లేఆఫ్ ప్రకటించిన ప్రైవేటు యాజమాన్యం కర్మాగారాలకు సంకెళ్లు వేయ డంతో ఇప్పటి వరకు తెరుచుకోలేదు. ప్రస్తుత ఎన్నికల్లో రాజకీయ పక్షాలు చెరుకు రైతుల ప్రయోజనాల ప్రాధాన్యతే ఎజెండాగా ముందుకు వెళ్తుండ డంతో రైతు చుట్టూ రాజకీయం నడుస్తున్నట్లయిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

హేమా హేమీల నోట..

జగిత్యాలలో గత నెల 18వ తేదీన ఎన్నికల ప్రచార విజయ సంకల్ప సభను నిర్వ హించిన ప్రధాని నరేంద్ర మోదీ నిజాం దక్కన్ షుగర్ కర్మాగారాన్ని ఇప్పటివరకు బీఆ ర్ఎస్, కాంగ్రెస్‌లు తెరిపించలేకపోయాయని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు సందర్భాల్లో ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని అంటున్నారు. ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఎన్‌డీఎస్ఎల్ కర్మాగారాలను వచ్చే యేడాది పునరుద్ధరిస్తామని హామీనిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తదుపరి ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించామని వివరిస్తున్నారు. బీఆర్ఎస్ సైతం ఎన్‌డీఎస్ ఎల్‌పై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెరుకు రైతులను ఆదుకుంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే జగిత్యాల జిల్లా ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి నిజాందక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపిస్తామని రైతులకు హామీనిచ్చారు. అన్నదాతలను ఆకర్శించడానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యూహాన్ని రచిస్తున్నాయి.


జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారం

ముగిసిన రెండో విడత జేఈఈ మెయిన్స్


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఈ నెల 4న ప్రారంభమైన రెండో విడత జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామిషన్) మెయిన్స్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు 124 మంది గైర్హాజరు అయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలిత కుమారి తెలిపారు. జేఈఈ పరీక్షలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఈ సెషన్‌లో 311 మందికి గానూ 187 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఫైల్‌నంబరు: 01ఈడీకే12

హంస వాహనంపై స్వామివారల విహారం


హంస వాహనంపై విహరిస్తున్న శ్రీ స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 12: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పార్వతీరాజరాజేశ్వర స్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు శుక్రవారం హంస వాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకము, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన హంస వాహనంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని రాఘవపూర్ గ్రామం వద్ద లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన బొజ్జ ప్రశాంత్ (25) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటాడు. శుక్రవారం తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

లింగంపేటలో కరెంట్ మోటర్ల చోరీలు

- ఆందోళనలో రైతులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 12: జగిత్యాల పట్టణంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా గుర్తు తెలియని దొంగలు విద్యుత్ కరెంటు మోటార్లను టార్గెట్‌గా చేసుకుని అపహరించుకవెలుతున్నారు. ఇప్పటికే లింగంపేటకు చెందిన ఎద్మల సహదేవ్, సిరికొండ ధర్మయ్య, సరగల్ల ప్రశాంత్‌లకు చెందిన వ్యవసాయ మోటార్లను దొంగలు అపహరించుకవెళ్లారు. తాజాగా దొంగ ధర్మరాజుకు చెందిన వ్యవసాయ మోటారును అపహరించుకవెళడంతో సాగు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికోచ్చే సమయంలో వరుసగా విద్యుత్ మోటార్ల చోరికి గురికావడం పట్ల రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు. అంతే కాకుండా ఎలుకబావి వాడలో నూతనంగా నిర్మించిన ఓ గృహం వద్ద బోరు మోటారును అపహరించుకువెళ్లారు. దీంతో రైతులతో పాటు ప్రజలు ఆందోళనకు గురువుతున్నారు. పోలీసులు నైట్ బీట్లను మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలని కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ధర్మపురి, ఏప్రిల్ 12: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీఐఎస్ఎఫ్ కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక పటేల్ చౌరస్తా, గాంధీచౌక్, నందిచౌక్, కమలాపూర్ చౌరస్తా మీదుగా ఎస్‌హెచ్ గార్డెన్స్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం అధికంగా పెంచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆయన అన్నారు. సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ యోగిందర్ సింగ్ మాట్లాడుతూ ఓటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడరాదని అన్నారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని అన్నారు. అంతకు ముందు ఫ్లాగ్‌మార్చ్ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు, విద్యార్థులు పూలు చల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రవీంద్రకుమార్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, ఆర్ఐ వేణు, ఆర్ఎస్ఐలు మారుతి, సుమన్, సీఐఎస్ఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫ్లాగ్‌మార్చ్ ప్రారంభిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న ఎంపీ బండి సంజయ్

గంగాధర, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వివరించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. జగిత్యాల నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపలికి వెళుతూ మార్గ మధ్యలో గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఎంపీ బండి సంజయ్ కార్యకర్తలతో కలిసి టీ తాగారు. చాయ్ తాగుతూ ఎన్నిలపై కార్యకర్తల తో ముచ్చటించి అనంతరం బోయినపల్లికి వెళ్లారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, అశోక్, కరుణాకర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 12: జమ్మికుంటలోని సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సర్వేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, కృష్ణాకాలని, ఎంప్లాయిస్ కాలని, హరితనగర్, కొండూరి కాంప్లెక్స్ పద్మాశాలి వీధి, పాత కూరగాయాల మార్కెట్, ఆబాది జమ్మికుంటకు ఉధయం 10 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తిమ్మాపూర్: మండలంలోని అలుగునూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమతుల దృష్ట్యా శనివారం ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అలుగునూర్, తిమ్మాపూర్, మహాత్మానగర్, ఎల్ఎండీ కాలనీలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైదాపూర్: మండలంలోని ఆకునూర్, సైదాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్‌లు, సబ్‌స్టేషన్ మరమ్మతులు ఉన్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బొమ్మ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు సైదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, కొండపల్కాల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేశ్ తెలిపారు. చెంజర్ల, కొండపల్కాల, పెద్దూరుపల్లి, ఖాదర్‌గూడెం, ఈదులగట్టెపల్లి గ్రామాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ స్తంభాలపై ఉన్న చెట్లను నరికివేయడం వల్ల సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడిస్తాం

- డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 12: రాబోయే లోకసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కాంగ్రెస్ శ్రేణులు ఓడించి తీరుతారని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా పార్లమెంట్ ఇన్‌చార్జ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు ఓటర్ల వద్దకు వెళ్లి అభ్యర్థించాల్సిందిగా కోరారు. పార్టీ అధిష్ఠానం అభ్యర్థిని ప్రకటించిన వెంటనే ప్రజలంతా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతారని పేర్కొన్నారు. ప్రజల్లో బండి సంజయ్, వినోద్‌కుమార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, ఖచ్చింతంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా తూర్పాటి రాజు



రాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్, ఏప్రిల్ 12: హుజూరాబాద్‌కు చెందిన తూర్పాటి రాజును బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు నియమిం చారు. ఈ సందర్భంగా తూర్పాటి రాజుకు నియామక పత్రాన్ని బీజేపీ నాయకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు మాడ గౌతమ్‌రెడ్డి, నర్సింహరాజు, గంగిశెట్టి రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుప్పాల రఘు, వొడ్నాల విజయ్, పోతుల సంజీవ్, సంజీవరెడ్డి, రాజు, సారయ్య, సంపత్, చంద్రిక, భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర, ఏప్రిల్ 12: మున్నూరుకాపు యూత్ ఫోర్స్ ప్రథమ వార్షికోత్సవ పోస్టర్‌ను శుక్రవారం గంగాధరలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ కన్వీనర్ మడ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 14న కరీంనగర్‌లో మున్నూరుకాపు యూత్ ఫోర్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ గర్జన సభకు నియోజకవర్గంలోని మున్నూరు కాపు యూత్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పి లుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వేముల భాస్కర్, అంజి, మడ్ల పల్లి గంగాధర్, జలపతి, వాసాల గంగాధర్, దాతు అంజి పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 12: అన్ని మండలాలకు అనుకూలంగా ఉండి సమీపంలో ఉన్న హుజూరాబాద్ కేంద్రంగా అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో స్టడీసెంటర్ ఉండడంతో మండలాల నుంచి వెళ్లే యువతి, యువకులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. హుజూరాబాద్‌లో స్టడీసెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సోమారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సీఈవో మల్లారెడ్డి

సైదాపూర్, ఏప్రిల్ 12: ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో మల్లారెడ్డి అన్నారు. మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమారం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ గడ్డం అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా ఎగిరేది కాంగ్రెస్ జెండానే

- డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12: కరీంనగర్ ఎంపీ అభ్యర్థి ఎవరనేది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, అభ్యర్థి ఎవరైనా ఎగురవేసేది కాంగ్రెస్ జెండానే అని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. టీవీ యాంకర్‌గా సమాజానికి పరిచయమైన రాణి రుద్రమకు రాజకీయాలపై అవగాహన లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. ఆయన ఎంపీగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి గురించి నియోజకవర్గంలో ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన పోరాటం గురించి నాటి ప్రతిపక్ష నేతలు సైతం కొనియాడారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ నుంచి ఆయన గెలుపొందడం మంత్రి పొన్నం పనితనానికి నిదర్శనమన్నారు. కరీంనగర్ ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించాలన్నారు. ఎంపీగా బండి సంజయ్ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న ఆలయాల అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చారో రాణి రుద్రమ తెలుసుకోవాలన్నారు. తమ అభ్యర్థి ఎవరనేది తమ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, అభ్యర్థి ఎవరైనా ఎగురవేసేది కాంగ్రెస్ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అవాకులు చెవాకులు పేలితే ఈ గడ్డపై అడుగుపెట్టలేరని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 14న కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడతామని తెలిపారు. ఈ దీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజ్‌హుస్సేన్ నాయకులు సిరికొండ శివప్రసాద్, కనకరెడ్డి, హైమద్ అలి, చింతల ఎల్లారెడ్డి, జూపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి

శ్రీనిలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు



మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుమలనగర్‌లోని శ్రీనిలయంలో నాలుగో రోజు శుక్రవారం నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో లక్ష్మీహవనం నిర్వహించారు. అంతకుముందు రామచంద్రస్వామికి, లక్ష్మీ అమ్మవారికి ఫలరస పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సముద్రాల వేణుగోపాలాచార్యులు, రామకృష్ణమాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేయాలి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 12: లిక్కర్ స్కాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవాస్తవాలు మాట్లాడినందునే బీజేపీ అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారని బండి సంజయ్ కారణంగానే రాష్ట్రంలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిందన్నారు. పదవికన్నా పార్టీ ముఖ్యమనే సిద్ధాంతాన్ని నమ్మి ఓడినా, గెలిచినా ప్రజాక్షేత్రంలో ఉన్నందునే భగవంతుని ఆశీర్వాదంతో పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి లభించింది తప్ప బండి సంజయ్‌లాగా చెప్పులు మోస్తే కాదని అన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులతోనే పొన్నం ప్రభాకర్ ప్రజలకు వాస్తవాలు తెలియజేశారన్నారు. అభ్యర్థి ఎంపిక ఆలస్యమైనా కరీంనగర్ ఎంపీగా ఎగర వేయబోయేది కాంగ్రెస్ పార్టీ జెండానేనని నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. లిక్కర్ స్కాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజాప్రతినిధిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇప్పటివరకు ఈ విషయంపై నోరుమెదపలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కరీంనగర్‌లో జైలు గదులు నిర్మిస్తామని చెప్పి సంజయ్ పత్తా లేకుండా పోయారని అన్నారు.

సనాతన ధర్మాన్ని అందరూ పాటించాలి



చినజీయర్ స్వామిజీతో మాజీ మంత్రులు గంగుల, హరీష్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: మన ధర్మం సనాతనమైందని, దాన్ని అందరూ పాటించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్నన్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజు శుక్రవారం ఉదయం, సాయంత్రం స్వామి ప్రవచనం చేశారు. కాలం గడచినా విలువలు మారవని అన్నారు. వైవస్వత మనువు కాలంలో అయోధ్య నిర్మాణం జరిగిందని అన్నారు. మానవులు మంచి అలవాట్లను కలిగి ఉండాలని, మంచి ఆహారం స్వీకరించాలని, శరీరారోగ్యం, కుటుంబ సమత పాటించాలని, ప్రకృతిని, ప్రాణులను పరిరక్షించాలని పేర్కొన్నారు. సమాజ సంబంధాలు పెంచుకోవాలని అన్నారు. కోసల రాజధాని దశరథుని అయోధ్య రాజ్యంలో ప్రజలు మానసికోల్లాసాలతో ఉండేవారని, సాంస్కృతిక వేదికలు, నాటక సంఘాలుండేవని అన్నారు. రహదారుల పక్కన ఫల, పూల వృక్షాలు ఏర్పాటు చేసి బాటసారుల ఆకలి, అలసట తీర్చగలిగే సదుపాయాలుండేవని అన్నారు. రామాయణ పారాయణం, శ్రవణం ఇహలోక, పరలోక సుఖాలను కల్గిస్తుందని అన్నారు. ఇక్ష్వాకు వంశ కులజుడై లోకాన్ని ఉద్ధరించిన రాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సకల సద్గుణ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. సమాజ సేవలో కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులను అభినందించారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, యాదకిషన్, ఎల్ భూపతిరావు, ఎస్ వెంకటేశం, వరప్రసాదాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● **చిన్న జీయర్‌స్వామి ఆశీర్వచనం తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు**

నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జెట్, వికాసతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రవచనానంతరం బీఆర్ఎస్ నాయకులు ఆశీర్వచనం తీసుకున్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ బి వినోద్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు, మానకొండూరు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, చల్మెడ లక్ష్మీనరసింహరావు తదితర నాయకులు పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు.. అన్నదానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హెలీప్యాడ్ గ్రౌండ్ పక్కన గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, యాగశాలలో నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. మేయర్ యాదగిరి సునీల్‌రావు సీతారాములను దర్శించుకొని పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, వెంకట్‌రావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమిటీ బాధ్యులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మేయర్ సునీల్‌రావు

రేషన్ దుకాణాలపై దాడులు

- రికార్డులు తనిఖీ చేసిన అధికారులు

- ముగ్గురు డీలర్లపై కేసు నమోదు



రేషన్ దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్, ఏప్రిల్ 12: హుజూరాబాద్ పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో సివిల్ సప్లయి అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అంజన్నకుమార్ రేషన్ దుకాణంలో 5.50క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నందున అతడిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వసంత్‌రావు, వేణుగోపాల్‌రావు, సురేందర్ చెప్పారు. ఈ దుకాణాన్ని వేరే డీలర్‌కు ఇన్‌చార్జీగా అప్పగించినట్లు వారు తెలిపారు. తనిఖీల్లో గంగాధర్, ఉషా, శ్రీనివాస్, కమలేశ్వర్, వినోద్ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో సివిల్‌సప్లయి అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. షాపులో ఉన్న నిల్వలకు రికార్డులకు పొంతన కుదరలేదు. సుప్రియ అనే డీలర్ దుకాణంలో షాపులో10.20కిలోలు, దయాకర్ షాపులో 5.50కిలోల బియ్యం వ్యత్యాసం వచ్చినట్లు అధికారులు గుర్తిం చారు. వ్యత్యాసం ఎందుకు వచ్చాయని నిర్వాహకులను ప్రశ్నించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అధికా రులు వెల్లడించారు. దాడుల్లో సివిల్ సప్లై అధికారులు వసంతరావు, సురేందర్, వేణుగోపాల్, ఉషా, శ్రీనివాస్, కమలేశ్వర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'సిండికేట్‌గా మారి దోపిడీ'

జమ్మికుంట, ఏప్రిల్ 12: మార్వాడిలు సిండికేట్‌గా మారి ప్రజలను దోచు కుంటున్నారని సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు చెలుపూరి రాము అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని ఏ పట్టణం, పల్లెకు పోయిన మార్వాడి వ్యాపారాలు విస్తరించి ఉన్నాయ న్నారు. నాణ్యత లేని వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నార న్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే యువతను కలుపుకుని ఆందోళనలు చేపడుతామని తెలిపారు.

కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 12: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేకొండలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బిల్లా వెంకట్‌రెడ్డి, నల్లాల రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పిట్టల రజిత, మాజీ ఎంపీటీసీ మామిడి రాజేశ్వరి, దుడ్డె లక్ష్మీనారయణ, అంబయ్య, గడ్డం అనిల్, అభిషేక్‌రెడ్డి, సంతోష్, అల్లెపు సంపత్, పోచయ్య, సిద్ది భాగ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉమహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

శంకరపట్నం, ఏప్రిల్ 12: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుడారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు జంగా జైపాల్, కనకం సాగర్, రాసమల్ల శ్రీనివాస్, బొజ్జ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీ కండువా వేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 12: హుజూరాబాద్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కొయ్యడ శ్రీదేవి- కమలాకర్ గౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రణవ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అ నంతరం శ్రీదేవి-కమలాకర్‌లు వొడితెల ప్రణవ్‌ను శాలువా తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో హుజూరాబాద్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు ప్రణవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, ఎండీ అప్సర్, మహేందర్‌గౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా మంత్ర జపకోటి యజ్ఞం

శంకరపట్నం, ఏప్రిల్ 12: మండలంలోని కేశవపట్నంలో బ్రహ్మ విద్యాశ్రమంలో శుక్రవారం రెండోరోజు శ్రీరామ తారక నామమహామంత్ర జపకోటి యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరి స్వామిజీ ఆధ్వర్యంలో యాజ్ఞికులు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక పూజలు, గీతాపారాయణం, భజనలు చేశారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని చెప్పారు. మహిళా వలంటీర్లకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. పలువురు భక్తులు యజ్ఞకర్త తనుకు ఓంకారును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యాసాశ్రమ మేనేజర్ అసంగానందగిరి స్వామిజీ, బ్రహ్మానందగిరి స్వామిజీ, చిన్మయానంద స్వామిజీ, అద్వైతానందగిరి మాతాజీ, అర్చకులు వెంకటా చార్యులు, నాగరాజాచార్యులు, ఆగయ్య, రాజయ్య, ప్రభాకర్, తిరుపతయ్య, సత్యనారాయణ, కుమార స్వామి, బాబన్న, రామస్వామి, సత్యనారాయణ, సోమేశ్వర్, రాజమల్లు, సమ్మయ్య, తిరుపతి, తిరుప తయ్య, మనోహర్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12: సిల్వర్‌జోన్ అంతర్జాతీయ సోషల్ సైన్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేటి తరంలో పోటీ పరీక్షలలో ప్రతిభ చాటే విధంగా శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. పాఠశాల స్థాయిలోనే పోటీపరీక్షల పరీక్షలపై పట్టు సాధించే విధంగా విద్యార్థులను ఎంపికచేసి పోటీ పరీక్షలకు పంపిస్తున్నా మన్నారు. సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో కె ఆరాధ్య, మహ్మద్ హసన్, ఎన్ సింగిరెడ్డి, సి హనిష్ పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12: రేకుర్తిలో 18వ డివిజన్ ఇన్‌చార్జి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్‌లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ఇన్ కో-కన్వీనర్ రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నాంపల్లి శంకర్, దుర్గం మోహన్, గంట్ల నర్సింహారెడ్డి, కీచర విష్ణుప్రసాద్‌రావు, గోదారి నరేష్, ఎం లక్ష్మీరాజం, జె రజిత తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో నేడు వసంతోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: ప్రజలకు సకల శుభాలు కలుగాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని క్షేత్ర వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మికవేత్త, పద్మశ్రీ భాష్యం విజయ సారథి స్కాందపురాణాంతర్గత నవవర్ష జయోత్సవ వ్రతాన్ని ఉద్ధరించారు. ఇందులో భాగంగా క్రోధి నామ సంవత్సరంలో వచ్చే తొలి శనివారాన్ని పురస్కరించుకొని క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాతసేవ, అనంతరం స్వామివారికి విశేష ద్రవ్యములతో మహాభిషేకం, అర్చన, నీరాజనం, అన్నప్రసాద వితరణ, రాత్రి ఏడు గంటలకు నవవర్ష జయవ్రత దీపోత్సవం, తీర్థ ప్రసాద, అల్పాహార వితరణ జరుగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తరించాలని సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భాష్యం వరప్రసాద్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారులకు ఆటల పోటీలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలోగల బాల కుటీర్ చిన్నారులకు ఐదు రోజులుగా వివిధ రకాల ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. వాటిలో గెలుపొందిన 24 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దనపురి సత్యమ్మ, బాలకుటీర్ అధ్యక్షుడు బి కరుణాకర్ రావు, రాజరెడ్డి, కనకయ్య, శ్రీనయన్ తదితరులు పాల్గొన్నారు.

రాముడు ఆదర్శ ప్రాయుడు

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రామోత్సవం



మాట్లాడుతున్న బుర్ర మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: రాముడు మానవ లోకానికి ఆదర్శ ప్రాయుడని రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శివాజీనగర్‌లో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పరిషత్ కార్యాలయంలో జరిగిన రామోత్సవం కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. రాముడు తన జీవన విధానం ద్వారా ఎన్నో సామాజిక, రాజకీయ, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మూల్యాలను అందించారని అన్నారు. అందుకే ఆయన కథ రామయణం లోకం ఉన్నంత కాలం ఉంటుందని పేర్కొన్నారు. రామాయణాన్ని చదవాలని, వినాలని అందులోని లోతైన విలువైన అంశాలను గ్రహించి ఆచరణలో పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగంటి మధుసూదన్‌రావు, ప్రాంత సేవా ప్రముఖ్ కోమళ్ళ రాజేందర్‌రెడ్డి, జిల్లా సేవాప్రముఖ్ బొమ్మకంటి కిషన్, జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, నగర సహకార్యదర్శి తోట రాజేందర్, మెండె లావణ్య, మెండె మమత, సంగం విజేత, గార్ల ప్రభావతి, సోమిడి రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం రాంనగర్ రోడ్ నంబర్ 10లో జరిగిన రామోత్సవానికి ప్రధాన వక్తగా రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో శుక్రవారం గ్రామ ఉపాధిహామీ కూలీలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొడిగూటి ప్రవీణ్‌కుమార్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధిహామీ కూలీలు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలు ఎండలకు ఇబ్బందులు పడకుండా మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

వీణవంక, ఏప్రిల్ 12: వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మడ్డి శంకరయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా శుక్రవారం అతిథి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి తన సన్నిహితుల ద్వారా 50కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పోతరవేన సతీష్, మద్దుల ప్రశాంత్, కాసనగొట్టు కర్నాకర్, కుమార్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.